
సాక్షి నిర్మల్

గురువారం । 11 । ఏప్రిల్ । 2024



ఇప్పచెట్లపై గొడ్డలి వేటు

సారంగపూర్ మండలంలోని అటవీ ప్రాంతాల్లో అక్రమార్కులు ఇప్పచెట్లను నరికి ఇష్టారాజ్యంగా లారీల్లో తరలిస్తున్నారు. 8లో▸



మట్టిరోడ్లు.. కచ్చా డ్రెయిన్లు..!

భైంసా పట్టణంలోని ఆరో వార్డులో ప్రజలు సమస్యలతో సహవాసం చేస్తున్నారు. కాలనీలు ఏర్పడి ఏళ్లు గడుస్తున్నా పూర్తిస్థాయిలో అభివృద్ధి పనులు జరుగక అవస్థలు పడుతున్నారు. 9లో▸

గరిష్టం/కనిష్టం
34.0 /23.0

వాతావరణం

ఆకాశం పాక్షికంగా మేఘావృతమై ఉంటుంది. ఉష్ణోగ్రతలు ఘననీయంగా తగ్గుతాయి. వాతావరణం చల్లబడుతుంది.

న్యూస్‌రీల్

శిక్షణకు గైర్హాజరైన 43 మందికి నోటీసులు

ఖానాపూర్: ఈ నెల 1న ఖానాపూర్‌లోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో 'హౌజ్ ఆఫ్ పీపుల్స్' (హెచ్‌వోపీ) పేరిట ఎన్నికలకు సంబంధించి నియోజకవర్గస్థాయిలో పీవో, ఏపీవోలకు ఒకరోజు, ఓపీవోలకు ఒకరోజు శిక్షణ ఇచ్చారు. కార్యక్రమానికి గైర్హాజరైన ఖానాపూర్, కడెం, పెంబి, దస్తురాబాద్ మండలాలకు చెందిన 43 మంది అధికారులకు జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ బుధవారం నోటీసులు జారీ చేశారు. ఇందులో ఖానాపూర్ మండలానికి చెందిన 29 మంది, కడెం మండలానికి చెందిన 9 మంది, పెంబి మండలానికి చెందిన ముగ్గురు, దస్తురాబాద్ మండలానికి చెందిన ఇద్దరు అధికారులు ఉన్నారు. గైర్హాజరైనవారు అందుకు కారణాలు తెలుపుతూ వివరణ ఇవ్వాలని ఆదేశించారు. గైర్హాజరైన వారు కలెక్టర్ తీసుకునే చర్యలకు సంబంధిత శాఖలు ఎలాంటి బాధ్యత తీసుకోవని ముందే హెచ్చరించారు. అయినప్పటికీ కొందరు గైర్హాజర్ కావడం గమనార్హం.

జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించాలి



సమావేశంలో పాల్గొన్న నాయకులు

నిర్మల్‌చైన్‌గేట్: ఈ నెల 11న జ్యోతిరావు పూలే, 14న డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ జయంతి వేడుకలను తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా ఘనంగా నిర్వహించాలని తెలంగాణ అంబేడ్కర్ యువజన సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు కుంటోళ్ల వెంకటస్వామి అన్నారు. జిల్లా కేంద్రంలోని టీఎన్జీవోస్ సంఘ భవనంలో బుధవారం దళిత బహుజన ప్రజా సంఘాల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దళిత బహుజన ప్రజా సంఘాల ఆధ్వర్యంలో ఈ నెల 11న మహాత్మా జ్యోతిరావు పూలే జయంతి వేడుకలను నిర్మల్ జిల్లా కేంద్రంలోని టీఎన్జీవోస్ సంఘ భవనంలో ఉదయం 10 గంటలకు నిర్వహించబడునని, 14న అంబేడ్కర్ జయంతి వేడుకలను జిల్లా కేంద్రంలోని అంబేడ్కర్ చౌక్ మినీ ట్యాంక్ బండ్ వద్ద ఉదయం 10 గంటలకు నిర్వహించనున్నట్లు తెలిపారు. కార్యక్రమాలను విజయవంతం చేయాలని ఆయన కోరారు.

బీజేపీ బీసీ మోర్చా రాష్ట్ర కార్యవర్గ సభ్యుడిగా 'ఆకుల'



కార్తీక్‌ను సన్మానిస్తున్న నాయకులు

నిర్మల్‌చైన్‌గేట్: బీజేపీ బీసీ మోర్చా రాష్ట్ర కార్యవర్గ సభ్యుడిగా ఆకుల కార్తీక్‌ను నియమించినట్లు పార్టీ జిల్లా అధ్యక్షుడు అంజుకుమార్‌రెడ్డి బుధవారం ప్రకటించారు. ఈ సందర్భంగా కార్తీక్‌ను పార్టీ నాయకులు శాలువాతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శులు మెడిసెమ్మ రాజు, సామ రాజేశ్వర్‌రెడ్డి, సీనియర్ నాయకులు రావుల రాంనాథ్, అసెంబ్లీ కన్వీనర్ గాదె విలాస్, బీజేవైఎం జిల్లా అధ్యక్షుడు ఒడిశాల అర్జున్, బీజేవైఎం అసెంబ్లీ కన్వీనర్ కొండాజి శ్రవణ్, తదితరులు పాల్గొన్నారు.

సీతారాముల పల్లకిసేవ



పల్లకిసేవలో భక్తులు

ఖానాపూర్: శ్రీరామ నవమిని పురస్కరించుకుని పట్టణంలోని శ్రీరాంనగర్ కాలనీలో బుధవారం సీతారామచంద్రస్వామి పల్లకిసేవ భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. వసంత నవరాత్రిని పురస్కరించుకుని అఖండ దీప ప్రజ్వలనలో భాగంగా హనుమాన్ స్వాములు రామనామ సంకీర్తనలతో శోభాయాత్ర నిర్వహించారు.

ఎన్నికల సామగ్రి పరిశీలన



పరిశీలిస్తున్న ఆర్డీవో కోమల్‌రెడ్డి

ముధోల్: మండల కేంద్రంలోని బాలుర వసతి గృహంలో భద్రపరిచిన ఎన్నికల సామగ్రిని బుధవారం ఆర్డీవో కోమల్‌రెడ్డి పరిశీలించారు. స్థానిక ఎమ్మార్వో విఠల్‌తో కలిసి స్ట్రాంగ్‌రూంలోని ఎన్నికల సామగ్రి, ఈవీఎంలను పరిశీలించారు. రానున్న పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో ఏర్పాట్లను ఎప్పటికప్పుడు సరిచూసుకోవాలని సిబ్బందికి సూచించారు.

ఆర్‌ఎంపీలు.. జాగ్రత్త!



- అర్హత లేకుండా వైద్యంపై సీరియస్
- 'ప్రథమ చికిత్స'కు మాత్రమే అనుమతి
- పేరుకు ముందు డాక్టర్ అని పెట్టొద్దు
- సీరియస్‌గా ఆదేశించిన వైద్యారోగ్యశాఖ
- ఆస్పత్రులకు సిఫార్సులపైనా సీరియస్

నిర్మల్: జిల్లాల్లో రోజురోజుకూ శృతిమించుతున్న ఆర్‌ఎంపీల తీరుపై రాష్ట్ర వైద్య, ఆరోగ్యశాఖ ఇటీవల సీరియస్‌గా స్పందించింది. గ్రామాల్లో తామే 'డాక్టర్'లుగా చలామణి అవుతున్న తీరుపైనా హెచ్చరించింది. తెలంగాణ క్లినికల్ ఎస్టాబ్లిష్‌మెంట్ (రిజిస్ట్రేషన్ అండ్ రెగ్యులేషన్)యాక్ట్–2010 ప్రకారం ప్రథమ చికిత్స చేసే ఆర్‌ఎంపీలు తమ పేరు ముందు డాక్టర్ అని పెట్టుకోకూడదని ఆదేశించింది. ప్రజల ప్రాణాలతో ఇష్టారీతిన వ్యవహరిస్తున్న తీరుపై సీరియస్‌గా చర్యలు తీసుకుంటామని పేర్కొంది. జిల్లాలోనూ చాలామంది ఆర్‌ఎంపీల వ్యవహారం వివాదాస్పదంగానే సాగుతోంది.

జిల్లాలోనూ ఆర్‌ఎంపీల హవా..

నిర్మల్, భైంసా, ఖానాపూర్ పట్టణాల్లో పెద్దపెద్ద ఆస్పత్రులు కట్టుకున్న కొంతమంది వైద్యుల కంటే కొన్ని మండలాల్లో ఆర్‌ఎంపీలు హవా నడిపిస్తున్నారు. కొన్నిచోట్ల రోజుకు పదులసంఖ్యలో ఓపీ ఉంటోంది. చాలామంది ఆర్‌ఎంపీలు ప్రథమ చికిత్సతోనే ఆగడం లేదు. ఏకంగా స్టెతస్కోప్ పట్టుకుని పరిశీలిస్తూ.. తమకు తోచిన ప్రిస్కిప్షన్ రాసేస్తున్నారు. ఏ సమస్యతోనైనా తన వద్దకు పేషెంటు రాగానే ముందుగా సెలైన్ బాటిల్ ఎక్కించేస్తున్నారు. 'జల్దీ.. జరం తక్కువైపోవాలె సారూ..' అని ఎవరన్నా అన్నారంటే.. తమకు తెలిసిన పెద్దపెద్ద గోలీలు రాసేస్తున్నారు. మరికొంతమంది మరోఅడుగు ముందుకేసి చిన్నపాటి ఆపరేషన్లనూ చేసేస్తున్నారు.

పిల్లలు పుట్టేందుకూ..

జిల్లాలో కొంతమంది ఆర్‌ఎంపీల తీరు మరింత వివాదాస్పదంగా ఉంది. ఏళ్లుగా పిల్లలు పుట్టని వారికి మందులు ఇస్తామంటూ ప్రచారం చేసుకుంటున్నారు. హైదరాబాద్ దాకా పోయొచ్చినా.. ఎన్ని దవాఖానాలు తిరిగినా సంతానం కానివాళ్లల్లో చాలామందికి తమవద్దకు రాగానే సంతానమైందని, తాము చెప్పినట్లు ట్రీట్‌మెంట్ తీసుకుంటే చాలని చెబుతున్నారు. మండలాల్లోనే కాదు.. సాక్షాత్తూ జిల్లాకేంద్రంలోనే ఇలాంటి ఆర్‌ఎంపీలు ఉండటం గమనార్హం. ఎన్నేళ్లు వాళ్ల వద్దకు తిరిగినా.. సంతానం కాకపోతే.. ఇక మీలోనే ఏదో లోపముందంటూ పంపించేస్తున్నారు. ఇలాంటి బాధితుల దగ్గర ఫీజులనూ భారీగానే వసూలు చేస్తున్నారు. నిబంధనలకు విరుద్ధంగా కొంతమంది కాన్పులు, అబార్షన్లు సైతం చేస్తున్నారు. సారంగపూర్ మండలంలో నాలుగేళ్ల క్రితం ఓ వివాహితకు అబార్షన్‌కు ఆర్‌ఎంపీ యత్నించగా పరిస్థితి విషమించింది. ఆమెను నిజామాబాద్ ఆస్పత్రికి తీసుకెళ్లగా అక్కడే తీవ్ర రక్తస్రావమై మృతి చెందింది.

సిఫార్సులతో సంపాదన..

జిల్లా కేంద్రంతో పాటు భైంసా, ఖానాపూర్‌లోనూ చాలా ప్రైవేటు ఆస్పత్రులు కేవలం ఆర్‌ఎంపీలు చేసే సిఫార్సులతోనే నడుస్తున్నాయనడం అతిశయోక్తి కాదు. కొన్ని ప్రైవేటు ఆస్పత్రులు ఆర్‌ఎంపీలకు భారీగా కమీషన్లు ఇవ్వడంతో పాటు దావత్‌లు, గిఫ్టులనూ ఇస్తున్నాయి. ఆర్‌ఎంపీల ఇళ్లల్లో ఫంక్షన్లు ఉంటే ఖరీదైన కానుకలను ఇస్తున్నారు. తమవద్దకు ఏ పేషెంట్ వచ్చినా తమకు ఎక్కువ కమీషన్లు ఇచ్చే ఆస్పత్రికే ఆర్‌ఎంపీలు సిఫార్సు చేస్తున్నారు. ఒకవేళ తన వద్దకు వచ్చివెళ్లిన పేషెంట్ తనకుతాను ఏదైనా ఆస్పత్రికి వెళ్లినా.. ఆర్‌ఎంపీలు సదరు ఆస్పత్రుల నుంచి కమీషన్లు వసూలు చేస్తున్నారు. పేషెంటు పరిస్థితి, వైద్యచికిత్సలు, ఆపరేషన్లు.. ఇలా ఆస్పత్రులు ఇచ్చే ట్రీట్‌మెంట్, వేసే బిల్లులను బట్టి వీరికి కమీషన్లు దక్కుతున్నాయి. కొన్ని ఆస్పత్రులు ఆర్‌ఎంపీలను తరచూ కలవడానికే పీఆర్‌వోలను పెట్టుకోవడం గమనార్హం.

ఆస్పత్రుల లెక్కనే..

గ్రామాల్లో అత్యవసర సమయాల్లో ప్రథమ చికిత్స అందించడమే ఆర్‌ఎంపీలు చేయాల్సిన పని. ఇందుకు తాము ఉంటున్న గదికి క్లినిక్ అని, ఆస్పత్రి అని, నర్సింగ్‌హోం, మెడికల్‌హాల్ అని కూడా పెట్టుకోవడానికి లేదు. కేవలం 'ఫస్ట్ ఎయిడ్ సెంటర్'(ప్రథమ చికిత్స కేంద్రం) అని మాత్రమే రాసుకోవాలి. అందులో ఇన్‌పేషెంట్లు ఉండటానికి వీలు లేదు. కానీ.. జిల్లాలోని చాలా మండలాల్లో ఏకంగా ఓ చిన్నపాటి ఆస్పత్రుల తరహాలోనే ఆర్‌ఎంపీలు మెయింటేన్ చేస్తున్నారు. నాలుగైదు బెడ్లు, అందులోనే మెడికల్‌హాల్ పెట్టేస్తున్నారు. ఏకంగా 'హాస్పిటల్'.. అంటూ బోర్డుపై రాసేసుకుంటున్నారు.

అధికారుల తీరూ అనుమానాస్పదమే..

ఓవైపు రాష్ట్ర వైద్యారోగ్యశాఖ ఆర్‌ఎంపీలు, ప్రైవేటు ఆస్పత్రులకు సంబంధించి పక్కాగా వ్యవహరిస్తుండగా జిల్లాలో మాత్రం ఆశాఖ వ్యవహరిస్తున్న తీరు అనుమానాలకు తావిస్తోంది. తమ కళ్లెదుటే ఆస్పత్రులు, ఆర్‌ఎంపీలు ఇష్టారీతిన వ్యవహరిస్తున్నా.. అదేం లేదన్నట్లుగా వాదిస్తోంది. సంబంధిత అధికారులు ఏదైన ఘటన జరిగినప్పుడే తూతూమంత్రంగా తనిఖీలు చేస్తున్నారు. ఆరోపణలు, ఫిర్యాదులనూ 'మాములు'గానే తీసుకుంటున్నట్లు శాఖాధికారుల పైనే ఆరోపణలు ఉన్నాయి.

వైద్య,ఆరోగ్యశాఖ సూచించిన నిబంధనలు..

- ఆర్‌ఎంపీలు తమ పేరుకు ముందు డాక్టర్ అని పెట్టుకోకూడదు.
- తమ చికిత్స కేంద్రానికి ఫస్ట్‌ఎయిడ్ సెంటర్ (ప్రథమచికిత్స కేంద్రం) అని మాత్రమే ఉండాలి.
- ఆర్‌ఎంపీలే స్వయంగా రోగనిర్ధారణ చేసి మందులు, ఇంజెక్షన్లు ఇవ్వొద్దు.
- రోగులకు మందులు(ప్రిస్కిప్షన్) రాసివ్వడం, సెలైన్ బాటిళ్లు ఎక్కించడం చేయొద్దు.
- ఇన్‌పేషెంట్లను ఉంచడం, ల్యాబ్‌లను నిర్వహించడం చేయకూడదు.
- అబార్షన్లు, కాన్పులు, హైరిస్కు చికిత్సలను చేయవద్దు.
- రోగులను ప్రలోభపెట్టడం, వైద్యం కోసం ఆస్పత్రులకు సిఫార్సు చేయడం, బలవంతంగా పంపడం చేయరాదు.

తాగునీటికి ఇబ్బంది పడకుండా చూడాలి

- ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి



వీసీలో పాల్గొన్న కలెక్టర్, అధికారులు

నిర్మల్‌చైన్‌గేట్: వేసవిలో తాగునీటికి ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు చేపట్టాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి అధికారులను ఆదేశించారు. బుధవారం హైదరాబాద్ నుంచి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా కలెక్టర్లతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సమస్యలు ఏర్పడితే ట్యాంకర్ల ద్వారా నీటిని సరఫరా చేయాలన్నారు. నీటి సమస్యలు పరిష్కరించేందుకు ఎమర్జెన్సీ బృందాలను ఏర్పాటు చేశామన్నారు. వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయాలని అధికారులను ఆదేశించారు. వర్షాలకు ధాన్యం తడిసిపోకుండా ఉండేందుకు టార్పాలిన్లు రైతులకు అందుబాటులో ఉంచాలన్నారు. అమ్మ ఆదర్శ పాఠశాలల్లో అత్యవసర పనులకు సంబంధించిన అంచనా వ్యయాలను సిద్ధం చేయాలని విద్యాశాఖ అధికారులను ఆదేశించారు. అన్ని బడుల్లో కమిటీలను ఏర్పాటు చేసి బ్యాంకు ఖాతాలను తెరవాలని ఆదేశించారు. వడదెబ్బ తగలకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. ఉపాధి హామీ కూలీలకు పని ప్రదేశాల్లో ఓఆర్‌ఎస్ ప్యాకెట్లు పంపిణీ చేయాలన్నారు. సమావేశంలో కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్, అదనపు కలెక్టర్ కిశోర్ కుమార్, జిల్లా పంచాయతీ అధికారి శ్రీనివాస్, డీఆర్డీవో విజయలక్ష్మి, డీఎంహెచ్‌వో ధనరాజ్, డీఈవో రవీందర్‌రెడ్డి, మిషన్ భగీరథ ఏఈ సందీప్, డీఎస్వో నందిత, సివిల్ సప్లై డీఎం శ్రీకళ, మున్సిపల్ కమిషనర్ రాజు, ఇతర అధికారులు పాల్గొన్నారు.

మూగజీవాలు విలవిల



సిరాల ప్రాజెక్టులో నీరు లేక ఇలేగాం గ్రామంలో నీటిని తాగుతున్న మూగజీవాలు

- గతేడాది తెగిన సిరాల ప్రాజెక్టు..
- నీళ్లు లేక ఎక్కడా చూసినా బండరాళ్లే దర్శనం..
- తాగునీటికి తండ్లాడుతున్న పశువులు



గ్రామంలోనే దాహం తీర్చుకుంటున్న మేకలు

భైంసా/భైంసారూరల్: 140 ఏళ్ల క్రితం నిర్మించిన సిరాల ప్రాజెక్టు గతేడాది జూలైలో కురిసిన భారీ వర్షాలకు తెగిపోయింది. దీంతో పరిసర గ్రామాల ప్రజలు, పశుపక్షాదులను నీటి కష్టాలు వెంటాడుతున్నాయి. ఎప్పుడూ జలకళతో ఉట్టిపడే సిరాల ప్రాజెక్టు ఎటుచూసినా బండరాళ్లతో దర్శనమిస్తోంది. వేసవికాలం వచ్చిందంటే ప్రాజెక్టు చుట్టూ ఉన్న గుట్టల్లో పక్షులు, పావురాలు కనిపించేవి. ప్రాజెక్టు తెగడంతో నీటి చుక్కలేక పోవడంతో పక్షులు కూడా రావడంలేదు. ఉమ్రి, బోల్సా, బోసి, బెల్‌తరోడ, బోంద్రట్, పాంగ్రి, మాంజ్రి, సిరాల, ఇలేగాం గ్రామాల్లోని పశువులు, ఎడ్లు, మేకలు, గొర్రెలు అన్నింటినీ ఇక్కడికే తీసుకువచ్చి నీటిని తాగించేవారు. ప్రాజెక్టు ఎండిపోవడంతో బోరుబావుల వద్ద మూగజీవాలకు నీటిని తాగించే పరిస్థితి ఎదురైంది.

పరిస్థితి తిరకాసు...

ప్రాజెక్టు చుట్టు పక్కల గ్రామాల్లోని రైతులు మహారాష్ట్ర సరిహద్దులో తమ బంధువుల ఇళ్లలోని మేకలు, గొర్రెలు, ఇతర మూగజీవాలను ఇక్కడికే తీసుకువచ్చేవారు. ప్రాజెక్టు నీటితో పక్కనే ఉన్న గడ్డిని మేపి మందుటెండల్లో గుట్టపై వాటిని ఆపి ప్రాజెక్టులో నీటిని తాగించుకుని వెళ్లేవారు. కానీ ఈసారి తమ వద్ద ఉన్న మూగజీవాలను పక్క గ్రామాలకు తోలుకెళ్తున్నారు.

మచ్చుకైనా కనిపించని చేపలు

సిరాల ప్రాజెక్టుతోపాటు కింద ఉన్న నాలుగు చెరువుల్లో చేపలు పుష్కలంగా ఉండేవి. గత పదేళ్లుగా వేసవి ఆరంభం నుంచి భారీ వర్షాలు కురిసే వరకు జాలర్లు చేపలుపడుతునే ఉండేవారు. సెలవు దొరికితే భైంసా పట్టణం నుంచి వందలాదిగా బైక్‌లపై వచ్చి నీటిలో గాలాలువేసి చేపలు పట్టుకువెళ్లేవారు. 50కిపైగా మత్స్య కుటుంబాలకు ఉపాధి దొరికేది. సిరాల ప్రాజెక్టులో సెరి కల్చర్‌లో చేపలు పెంచేవారు. ఇక్కడ సరదాగా విహరించేందుకు ఓ నాటు పడవ ఉండేది. నాటు పడవపై ప్రాజెక్టులోకి వెళ్లి తాజా చేపలు పట్టేవారు. ప్రస్తుతం చేపలు మచ్చుకైనా కనిపించడంలేదు.

అడుగంటుతున్న భూగర్భ జలాలు

సిరాల ప్రాజెక్టు చుట్టు పక్కన పల్లెల్లోనూ వ్యవసాయ బోరుబావుల్లో భూగర్భ జలాలు అడుగంటుతున్నాయి. వ్యవసాయ బోరుబావులు నీటిని పోయకపోవడంతో రైతులకు ఇబ్బందులు తప్పడంలేదు. రానున్న రోజుల్లో మూగజీవాలు, పశుపక్షాదులు నీటి కోసం ఎంతగా అల్లాడుతాయోనని ఆయా గ్రామాల ప్రజలు ఆందోళన చెందుతున్నారు.

చుక్క నీరు లేదు ...

సిరాల ప్రాజెక్టు కెనాల్‌తో ఇలేగాం కొత్త చెరువు, బాపూజీ మహారాజ్ చెరువు, దేగాం గ్రామంలోని మరో రెండు చెరువుల్లో నీరుండేది. ప్రాజెక్టు తెగడంతో కింద ఉన్న నాలుగు చెరువులు వట్టిపోయాయి. వేసవిలో పశువుల దప్పిక తీర్చేందుకు నీటితో ఉండే ఈ చెరువులన్నీ ఎడారిలా మారిపోయాయి. ఎండలు ముదురుతున్నకొద్దీ పశుపక్షాదులు నీటి కోసం అల్లాడుతున్నాయి. వన్య ప్రాణులకు సైతం నీరు దొరకడం లేదు. సిరాల ప్రాజెక్టు గుట్ట చుట్టూ జింకలు, కుందేళ్లు, నెమళ్లు, అడవి పందులు సంచరిస్తుండేవి. వన్య ప్రాణులన్నీ ప్రాజెక్టులో ఉన్న నీటినే తాగి జీవించేవి. ప్రాజెక్టులో నీరు లేక వన్యప్రాణులకు నీటి ఇక్కట్లు తప్పడంలేదు.

ఇంటివద్దే తాగిస్తున్నాం



సిరాల ప్రాజెక్టు కింద ఉన్న ఇలేగాం చెరువులో నీరు ఉండేది. ప్రాజెక్టు తెగడంతో చుక్కానీరు లేదు. దీంతో పశువులను ఇంటి వద్దకే తీసుకువచ్చి నీటిని తాగిస్తున్నాం. ప్రాజెక్టు తెగడంతో ఈఏడు మూగజీవాలకు నీటి ఇబ్బందులు పెరిగాయి.

– లక్ష్మణ్, రైతు, సిరాల

ఎటు చూసినా బండరాళ్లే



ఎప్పుడూ నీటితో కళకళలాడే సిరాల ప్రాజెక్టు ప్రస్తుతం బండరాళ్లతో కనిపిస్తోంది. ఎటు చూసినా ప్రాజెక్టులో బండరాళ్లే తప్ప నీటి జాడలు లేవు. వేసవి ఆరంభంలో మూగజీవాలు అల్లాడుతున్నాయి. ప్రాజెక్టు తెగడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నాం.

– రమేశ్, రైతు, సిరాల



నిర్మల్ జిల్లా కేంద్రంలో ముస్తాబు చేసిన ఈద్గా

నేడు రంజాన్

- ప్రత్యేక ప్రార్థనలకు మసీదులు, ఈద్గాల్లో ఏర్పాట్లు
- ఈద్ ఉల్ ఫితర్ నమాజ్‌కు సిద్ధమైన ముస్లింలు

నెన్నెల: రంజాన్ ఉపవాస దీక్షలు ముగిసాయి. ముస్లింలు అత్యంత పవిత్రంగా నెల రోజులపాటు ఉపవాస దీక్షలు ఆచరించి బుధవారం నాటికి 30 రోజులు కావడంతోపాటు సాయంత్రం ఆకాశంలో నెలవంక దర్శనమిచ్చింది. దీంతో గురువారం రంజాన్ పండుగను జరుపుకునేందుకు ముస్లింలు సిద్ధమయ్యారు. రంజాన్ దీక్షల అనంతరం షవ్వాల్ మాసం మొదటి రోజు నిర్వహించుకునే పండుగే ఈద్–ఉల్–ఫితర్. ఈ రోజు మసీదులు, ఈద్గాల్లో ప్రత్యేక ప్రార్థనలు చేస్తారు. ఇందుకోసం ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ఏర్పాట్లు చేశారు.

ఫిత్రాదానం

పండుగ రోజు నమాజ్‌కు ముందు పేదలకు ఇచ్చే దానమే ఫిత్రా. ఉపవాసాల పాటింపులో ఎన్ని జాగ్రత్తలు తీసుకున్నా పొరపాట్లు, లోపాలు జరుగుతూనే ఉంటాయి. ఈ లోపాలను పరిహారం చేసేదే ఫిత్రాదానం. సమాజంలోని నిరుపేదలు మంచి వస్త్రాలు ధరించి, మంచి వంటకాలు ఆరగించే వీలు కల్పిస్తూ ముస్లింలు దానం చేస్తుంటారు.

పండుగ శాంతియుతంగా జరుపుకోవాలి

- ఎస్పీ డాక్టర్ జానకీ షర్మిల

నిర్మల్‌టౌన్: రంజాన్ పండుగను శాంతియుతంగా జరుపుకోవాలని ఎస్పీ డాక్టర్ జానకీ షర్మిల అన్నారు. బుధవారం జిల్లా కేంద్రంలోని ఈద్గాం వద్ద గల ప్రార్థన స్థలాన్ని పరిశీలించారు. అధికారులను అడిగి వివరాలు తెలుసుకున్నారు. ప్రార్థనలకు ఎలాంటి అసౌకర్యాలు కలగకుండా చూడాలన్నారు. భారీ పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేయాలని సూచించారు. ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని కోరారు. ఎస్పీ వెంట నిర్మల్ డీఎస్పీ గంగారెడ్డి, పట్టణ సీఐ అనిల్ కుమార్, తదితరులు ఉన్నారు.

ఈద్గా వద్ద ఏర్పాట్లు పరిశీలన

భైంసాటౌన్: పట్టణంలోని గడ్డెన్నవాగు ప్రాజెక్టు సమీపంలోగల ఈద్గా వద్ద ఎస్పీ జానకీ షర్మిల ఏర్పాట్లు పరిశీలించారు. ట్రాఫిక్ ఇబ్బందులు తలెత్తకుండా తగిన చర్యలు తీసుకోవాలని, బందోబస్తు ఏర్పాట్ల సూచనలు చేశారు. ఆమె వెంట ఏఎస్పీ కాంతిలాల్‌పాటిల్, ఎంఐఎం నాయకులు ఫైజుల్లాఖాన్, మాజీద్, ఇంతియాజ్, తదితరులు ఉన్నారు.



జిల్లా కేంద్రంలోని ఈద్గాను పరిశీలిస్తున్న ఎస్పీ

ఉగాది కళారత్న పురస్కారం

నిర్మల్‌ఖిల్లా: యువకవి, కళాకారుడు పోలీస్ భీమేశ్‌కు వెన్నెల డ్యాన్స్ అకాడమీ సంస్థ ఉగాది కళారత్న పురస్కారం అందించింది. ఉగాది పర్వదినాన్ని పురస్కరించుకుని మంగళవారం సాయంత్రం జిల్లా కేంద్రంలో వెన్నెల డ్యాన్స్ అకాడమీ ఆధ్వర్యంలో జానపద జాతర పేరిట కార్యక్రమం నిర్వహించారు. శిల్పం, చిత్రలేఖనం, కవిత్వం వంటి పలుకళల్లో రాణిస్తున్న యువకవి, కళాకారుడు పోలీస్ భీమేశ్‌కు జానపద కళాకారులు రేలారె రేలా రవి, నాగలక్ష్మి, వెన్నెల డ్యాన్స్ అకాడమీ నిర్వాహకులు డాన్స్ మాస్టర్ ధనరాజ్ పురస్కారాన్ని అందజేశారు. ఈ సందర్భంగా భీమేశ్‌ను జిల్లాకు చెందిన పలువురు కవులు, కళాకారులు, సాహితీవేత్తలు అభినందించారు.



కళారత్న పురస్కారం స్వీకరిస్తున్న పోలీస్ భీమేశ్

'గిరి' ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలి

ఆసిఫాబాద్‌రూరల్: గిరిజన సంక్షేమ పాఠశాలల్లో పని చేస్తున్న ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలని గిరిజన సంక్షేమ గెజిటెడ్ హెచ్‌ఎంల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు శ్రీరాములు అన్నారు. బుధవారం హైదరాబాద్‌లో ముఖ్యమంత్రి ప్రత్యేక కార్యదర్శి శేషాద్రికి వినతిపత్రం అందించారు. శ్రీరాములు మాట్లాడుతూ గిరిజన శాఖలో ఖాళీగా ఉన్న మండల విద్యాధికారులు, ఇతర పోస్టులు భర్తీ చేయాలన్నారు. గిరిజన ఉపాధ్యాయులకు వసతిగృహాల బాధ్యతలు అప్పగించిన నేపథ్యంలో వారికి గురుకులాల్లో అమలు చేస్తున్న వేతన స్కేల్ అమలు చేయాలని కోరారు. బదిలీలు, పదోన్నతులు చేపట్టాలని, కాంట్రాక్టు టీచర్లను రెగ్యులర్ చేయాలని, పెండింగ్ బిల్లులు విడుదల చేయాలన్నారు. 317 జీవో బాధితులకు న్యాయం చేయాలన్నారు. కార్యక్రమంలో నాయకులు సారయ్య, సుధాకర్, ఉద్ధవ్ తదితరులు పాల్గొన్నారు.



వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

క్లుప్తంగా

పిడుగుపాటుతో ఎద్దు మృతి


మృతి చెందిన ఎద్దు

బజార్‌హత్నూర్: మండలంలోని మంజరం తండా గ్రామంలో మంగళవారం రాత్రి పిడుగుపాటుతో ఎద్దు మృతి చెందింది. నిస్తే నెహ్రూలాల్‌కు చెందిన ఎడ్లను పొలం పనుల తర్వాత రాత్రి కొట్టంలో కట్టి ఉంచాడు. అర్ధరాత్రి ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం పడింది. బుధవారం ఉదయం కొట్టం వద్దకు వెళ్లి చూడగా పిడుగు పాటుతో ఎద్దు మృతి చెంది కనిపించినట్లు బాధిత రైతు తెలిపాడు. ఎద్దు విలువ రూ.60 వేల వరకు ఉంటుందని పేర్కొన్నాడు. ప్రభుత్వం ఆదుకోవాలని కోరాారు.

కాళ్ల నొప్పులు భరించలేక ఆత్మహత్య


లచ్చిరాం మృతదేహం

తానూరు(ముధోల్): కాళ్ల నొప్పులు భరించలేక ఒకరు ఆత్మహత్య చేసుకున్న సంఘటన మండల కేంద్రంలో చోటు చేసుకుంది. ఎస్సై సందీప్ తెలిపిన వివరాల ప్రకారం మండల కేంద్రానికి చెందిన అవదుత్వార్ లచ్చిరాం (59) కొంతకాలంగా బోదకాల వ్యాధితో బాధపడుతున్నాడు. గతంలో కాళ్ల నొప్పులు అధికం కావడంతో సర్జరీ చేయించుకున్నాడు. అయినా తగ్గకపోవడంతో మనస్తాపానికి గురయ్యాడు. బుధవారం మధ్యాహ్నం పంటచేనుకు వెళ్లివస్తానని ఇంట్లో చెప్పి బయటకు వెళ్లాడు. ధర్మాబాద్ రోడ్డులో చెట్టుకు ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. గమనించిన ప్రయాణికులు కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. ఎస్సై సందీప్ ఘటన స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పరిశీలించారు. మృతుని భార్య గంగాబాయి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై తెలిపారు.

మొక్కజొన్న పంట దగ్ధం


దగ్ధమైన మొక్కజొన్న పంట

భైంసారూరల్(ముధోల్): మండలంలోని కుంసరలో విద్యుదాఘాతంతో మొక్కజొన్న పంట దగ్ధమైంది. గ్రామానికి చెందిన మేడిపల్లి దేవేందర్ అనే రైతు రెండెకరాల్లో మొక్కజొన్న సాగు చేశాడు. పంట కోతకు రావడంతో ఇటీవల కూలీలతో కోయించి చేనులోనే కుప్పగా వేశాడు. బుధవారం విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ వద్ద మంటలు చెలరేగి పంట మొత్తం దగ్ధమైంది. ఘటనలో సుమారు రూ.2లక్షల మేర పంటనష్టం జరిగిందని రైతు వాపోయాడు.

రోడ్డు ప్రమాదంలో ఒకరికి గాయాలు

ఆదిలాబాద్‌టౌన్: పట్టణంలోని కైలాస్‌నగర్‌కు చెందిన బొడకుంటవార్ సాంబశివ్ అనే వృద్ధుడు కలెక్టర్‌చౌక్ నుంచి బస్టాండ్ వైపు మంగళవారం మధ్యాహ్నం నడుచుకుంటూ వెళుతున్నాడు. ఈ క్రమంలో బైక్ నడుపుతున్న వ్యక్తి వెనుక నుంచి ఢీకొట్టడంతో వృద్ధుడి తలకు తీవ్రగాయాలయ్యాయి. స్థానికులు రిమ్స్ ఆసుపత్రికి తరలించగా వైద్యుల సూచన మేరకు మెరుగైన వైద్యం కోసం కుటుంబీకులు హైదరాబాద్‌కు తరలించారు. బాధితుడి కుమారుడి ఫిర్యాదు మేరకు టూటౌన్‌లో బుధవారం కేసు నమోదైంది. దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ అశోక్ తెలిపారు.

ఇప్పచెట్లపై గొడ్డలి వేటు



- అనుమతులు లేకుండానే ఇష్టారీతిన నరికేస్తున్న వైనం
- ముక్కలు చేసి విక్రయాలు
- పట్టించుకోని అటవీశాఖ అధికారులు

సారంగాపూర్: మండలంలోని అటవీ ప్రాంతాల్లో అక్రమార్కులు ఇప్పచెట్లను ఇష్టారాజ్యంగా నరికి లారీల్లో తరలిస్తున్నారు. సాధారణంగా పట్టాభూమిలో పెంచిన చెట్లను నరకడానికే అధికారులు సవాలక్ష ఆంక్షలు, అనుమతులు అంటూ ఇబ్బందులు పెడుతుంటారు. కానీ ఎలాంటి అనుమతులు లేకుండానే మండలంలోని జామ్, అడెల్లి, ధని, చించోలి(బి) తదితర గ్రామాలకు సమీపంలోని అడవిలో పెరిగిన ఇప్పచెట్లను నరికి చిన్నచిన్న ముక్కలుగా కోసి లారీల్లో తరలిస్తున్నా అటవీశాఖ అధికారులు పట్టించుకోకపోవడం పలు అనుమానాలకు తావిస్తోంది. దాదాపు 50 వరకు ఇప్పచెట్లు నరికివేతకు గురైనట్లు ఆయా గ్రామాల ప్రజలు పేర్కొంటున్నారు.

ఏజెంట్లను నియమించుకుని...

అటవీ ప్రాంతాల్లో ఇప్పచెట్లు ఎక్కడెక్కడ ఉన్నాయి. వాహనం అంతవరకు వెళ్తుంది.. తెలుసుకునేందుకు కలప వ్యాపారులు గ్రామాల్లో కొంతమందిని నియమించి సర్వే చేయిస్తారు. అలాగే పట్టా భూముల్లోనూ చెట్లు ఉన్నాయా లేదా అని ఆరాతీసి ఏజెంట్ల ద్వారా మధ్యవర్తిత్వం కుదుర్చుకుంటారు. వాటిని చూసిన తర్వాత లేబర్, లారీ, కలపకోసే యంత్రాలను వెంట తీసుకుని వచ్చి ఎంతపెద్ద చెట్లయినా గంటల్లోనే నరికివేసి ముక్కలుగా కోసి లారీల్లో కలప డిపోకు తరలిస్తారు. అక్కడి నుంచి దాబాహోటళ్లు, పెద్దపెద్ద రెస్టారెంట్లు, తదితర వాటికి విక్రయించి సొమ్ము చేసుకుంటున్నారు.

నిబంధనల ప్రకారం...

అటవీశాఖ నిబంధనల ప్రకారం ఏదేని చెట్టు రైతుల పట్టా ఉన్న పంటపొలంలో ఉండి వాటివల్ల ఏదైనా నష్టం ఉందని భావిస్తే అటవీశాఖ అధికారులకు దరఖాస్తు చేసుకోవాలి. అటవీ భూమిలో ఉన్న చెట్లను నరికివేయడానికి అటవీశాఖ అధికారులు ఎలాంటి అనుమతులు ఇవ్వరాదని నిబంధనలున్నాయి. కానీ కలప వ్యాపారులు మాత్రం రైతుల పంటపొలాల్లో ఉన్న చెట్లను సాకుగా చూపి వాటికి అనుమతులు తీసుకుని అటవీ ప్రాంతంలో ఉన్న చెట్లను నరికేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి ఇప్పచెట్లను, అడవులను రక్షించాలని ప్రజలు కోరుతున్నారు.

చర్యలు తీసుకుంటాం

అటవీశాఖ నిబంధనల ప్రకారం పట్టా భూమిలో రైతుకు ఇబ్బందికరంగా ఉన్న చెట్లను తొలగించడానికి మాత్రమే అనుమతులు ఇస్తాం. అటవీ ప్రాంతంలో ఉన్న చెట్లను నరికేందుకు అనుమతులు ఇవ్వడం కుదరదు. నిబంధనలకు విరుద్ధంగా చెట్లు నరికితే ఉపేక్షించేది లేదు. అలాంటి వారిపై తప్పకుండా చర్యలు తీసుకుంటాం.

– శ్రీదేవి, డీఆర్‌వో, సారంగాపూర్

‘బోరిగాం’ సందర్శించిన అధికారులు


ట్యాంకు శుభ్రం చేస్తున్న సిబ్బంది


మిషన్ భగీరథ నీటిని పరీక్షిస్తున్న అధికారులు

సాక్షి స్పందన

లక్ష్మణచాంద(నిర్మల్): మండలంలోని బోరిగాం గ్రామానికి అనుబంధ గ్రామమైన బోరిగాం తండాను బుధవారం అధికారులు సందర్శించారు. గ్రామంలో మిషన్ భగీరథ నీరు సక్రమంగా రాకపోవడంతో గ్రామస్తులు పడుతున్న ఇబ్బందులపై ‘ఇరవై రోజుల వుతోంది’ శీర్షికన ‘సాక్షి’లో కథనాన్ని ప్రచురించింది. స్పందించిన ఎంపీవో నసీరుద్దీన్, మిషన్ భగీరథ ఏఈ రాజశేఖర్‌రెడ్డి, బోరిగాంతండాను సందర్శించారు. గ్రామంలోని తాగునీటి ట్యాంకును శుభ్రం చేయించారు. మిషన్ భగీరథ నీటిని పరీక్షించి వినియోగించుకోవాలని గ్రామస్తులకు సూచించారు. తమ సమస్య పరిష్కారానికి కృషి చేసిన ‘సాక్షి’కి తండావాసులు కృతజ్ఞతలు తెలిపారు.

ఇంద్రాదేవికి చైత్రమాస పూజలు


ఆలయం వద్ద పూజల్లో ఆదివాసీలు


నైవేద్యాలు తయారు చేస్తున్న మహిళలు

ఇంద్రవెల్లి: మండలకేంద్రంలోని ఇంద్రాదేవి ఆలయంలో ఆదివాసీలు బుధవారం చైత్రమాస పూజలు ప్రారంభించారు. ఇంద్రవెల్లి, గోండ్‌గూడ, పర్ధాన్‌గూడకు చెందిన వారు ఆలయానికి చేరుకొని ప్రత్యేక పూజలు చేశారు. నైవేద్యాలు సమర్పించి మొక్కు తీర్చుకున్నారు. ఈ పూజలు నెల రోజుల పాటు కొనసాగుతాయని, ఉమ్మడి జిల్లా నుంచి ఆదివాసీలు తరలిరానున్నట్లు ఆలయ మహరాజ్ సూర్యారావ్ తెలిపారు. కార్యక్రమంలో ఆయా గ్రామాల పెద్దలు నాగోరావ్, జ్ఞానేశ్వర్, రాజు, ఇంద్రు, శంకర్, కోసుబాయి, అనుసూయబాయి తదితరులున్నారు.

మహా సంకల్ప పాదయాత్ర ప్రారంభం


దీక్ష భూమి వద్ద సేవాలాల్ మహరాజ్ పల్లకితో జెడ్పీ చైర్మన్ రాథోడ్ జనార్దన్

నార్నూర్: ఆదిలాబాద్ జిల్లా నార్నూర్ మండలం కొత్తపల్లి హెచ్ గ్రామంలోని బంజారా జాతీయ దీక్ష భూమి నుంచి మహారాష్ట్రలోని బంజారా కాశి పోరాదేవి పుణ్యక్షేత్రం వరకు వేలమంది సేవాలాల్ భక్తులు చేపట్టిన మహా సంకల్ప పాదయాత్రను బుధవారం దీక్ష గురువు సద్గురు ప్రేమ్‌సింగ్ మహరాజ్, జెడ్పీ చైర్మన్ రాథోడ్ జనార్దన్ ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆధ్యాత్మికతతోనే మానసిక ప్రశాంతత లభిస్తుందన్నారు. ప్రతి ఒక్కరూ చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలని సూచించారు. సేవాలాల్ భక్తులు దాదాపు 150 కిలోమీటర్లు శాంతియుతంగా, భక్తిశ్రద్ధలతో పాదయాత్ర కొనసాగించాలని తెలిపారు. సేవాలాల్ భక్తులతో కలిసి జెడ్పీ చైర్మన్ ఉట్నూరు మండలం హస్నాపూర్ వరకు పాదయాత్రలో పాల్గొన్నారు. మండలంలోని గంగాపూర్, తాడేహత్నూర్ గ్రామాల్లో పాదయాత్రకు ప్రజలు నీరాజనం పలికారు. పాదయాత్రలో ఉమ్మడి జిల్లా నుంచే కాకుండా వివిధ ప్రాంతాల నుంచి వేలసంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. కార్యక్రమంలో మాజీ మంత్రి అమర్‌సింగ్ తిలావత్, మాజీ ఎంపీ రాథోడ్ రమేశ్, మాజీ ఎమ్మెల్యే రేఖశ్యాంనాయక్, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు నరేష్ జాదవ్, ఐటీడీఏ ప్రకాశ్, సర్పంచ్‌ల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గజానంద్‌నాయక్, తదితరులున్నారు.

నామినేటెడ్ కాదు..చట్టసభల్లో పదవులు కావాలి

- ఆదివాసీ ఆరు తెగల నేతల డిమాండ్


అభివాదం చేస్తున్న ఆదివాసీ ఆరు తెగల నాయకులు

ఆదిలాబాద్‌రూరల్: రాజకీయ పార్టీలు ఆదివాసీల్లోని ఒకే తెగకు గుర్తింపునిస్తూ, తమను పట్టించుకోవడం లేదని పర్ధాన్, తోటి, కొలాం, నాయక్‌పోడ్, అంద్, మన్నెవార్ తెగలకు చెందిన నాయకులు ఆవేదన వ్యక్తం చేశారు. నామినేటెడ్ పదవులు కాదని తమకు చట్ట సభల్లో గొంతెత్తే పదవులు కావాలని డిమాండ్ చేశారు. ఆదివాసీ ఆరు తెగల ఐక్యవేదిక సమావేశం జిల్లా కేంద్రంలోని యాదవ సంఘ భవనంలో బుధవారం నిర్వహించారు. ఉమ్మడి జిల్లాతో పాటు ఆయా సంఘాల రాష్ట్ర నేతలు హాజరై మాట్లాడారు. ఆయా రాజకీయ పార్టీలు గుర్తింపు నివ్వకపోవడంతో విద్య, ఉద్యోగ, రాజకీయ రంగాల్లో తీవ్ర అన్యాయానికి గురవుతున్నామన్నారు. తాము ఏ తెగకు వ్యతిరేకం కాదని, ఆయా పార్టీలు అన్ని తెగలకు సమాన అవకాశాలు కల్పించాలన్నారు. అవసరమైతే ఆరు తెగల్లోని ఒకరిని స్వతంత్ర అభ్యర్థిగా బరిలో నిలిపేందుకు కార్యాచరణ ప్రకటిస్తామన్నారు. సమావేశంలో ఆయా సంఘాల నాయకులు ఆత్రం భీంరావ్, జడ్కె పాండురంగ్, సట్ల అశోక్, మెస్రం బాపురావ్, ఖమ్ము, నగేశ్, ఆనంద్‌రావ్, భీముడు, సుధాకర్, శంకర్, ప్రేంకుమార్, సొనేరావ్, రాజు, సుభాష్ తదితరులు పాల్గొన్నారు.

రక్తహీనతతో గర్భిణి మృతి

- సిరికొండ మండలంలో ఘటన
- వివాహం అయిన ఏడాదిలోపే మృత్యువాత


విమలాబాయి(ఫైల్)

సిరికొండ: రక్తహీనతతో గర్భిణి మృతి చెందిన సంఘటన ఆదిలాబాద్ జిల్లా సిరికొండ మండలం పొన్న ఎక్స్‌రోడ్ గ్రామంలో చోటు చేసుకుంది. కుటుంబ సభ్యులు తెలిపిన ప్రకారం వివరాలిలా ఉన్నాయి.. గ్రామానికి చెందిన పెందూర్ సాయికిరణ్‌కు గత ఏడాది మేలో ఇచ్చోడ మండలం బాదిగూడకు చెందిన విమలాబాయితో(25) వివాహం అయింది. ఆమె ప్రస్తుతం ఏడు నెలల గర్భిణి. ప్రసవం కోసం ఇటీవల పుట్టింటికి వెళ్లింది. మంగళవారం మధ్యాహ్నం విరేచనాలు కావడంతో కుటుంబ సభ్యులు 108లో ఇచ్చోడ పీహెచ్‌సీకి తరలించారు. అక్కడ వైద్యులు అందుబాటులో లేకపోవడంతో స్టాఫ్‌నర్సు ఆమెకు సాధారణ నొప్పులే అని వైద్యం అందించారు. అయితే సాయంత్రం గర్భిణికి కడుపు గట్టిపడిన విషయం కుటుంబ సభ్యులు సిబ్బందికి తెలుపడంతో వెంటనే రిమ్స్‌కు తరలించారు. 108లో రిమ్స్‌కు తరలించేలోగా మృతి చెందినట్లు తెలిపారు. అయితే ఇచ్చోడ పీహెచ్‌సీలో వైద్యులు అందుబాటులో ఉండి, సకాలంలో వైద్యం అంది ఉంటే విమలాబాయి బతికి ఉండేదని కుటుంబ సభ్యులు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ విషయమై ఇచ్చోడ పీహెచ్‌సీ వైద్యుడు సాగర్‌ను ‘సాక్షి’ఫోన్‌లో వివరణ కోరగా.. ‘వారం నుంచి నేను సెలవులో ఉన్నా.. అక్కడ ఏం జరిగిందో.. మంగళవారం ఎవరిని ఇన్‌చార్జిగా నియమించారో నాకు తెలియదు..’ అంటూ పేర్కొనడం గమనార్హం. కాగా, తీవ్ర రక్తహీనత, విరేచనాలతో గర్భిణి మృతి చెందినట్లు డిప్యూటీ డీఎంహెచ్‌వో మనోహర్ పేర్కొన్నారు.

వివాహిత ఆత్మహత్య


జ్యోత్స్న మృతదేహం

కడెం: ఉరేసుకుని వివాహిత ఆత్మహత్య చేసుకున్న సంఘటన మండలంలో చోటు చేసుకుంది. ఎస్సై కృష్ణసాగర్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం మండలంలోని కన్నాపూర్ గ్రామానికి చెందిన బొడ్డుపల్లి జ్యోత్స్న (27) బుధవారం ఇంట్లో ఎవరూ లేని సమయంలో చీరతో దూలానికి ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. తన కూతురు మరణంపై అనుమానం ఉందని మంచిర్యాలకు చెందిన మృతురాలు తల్లి సిబ్బిడి పద్మ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై తెలిపారు. మృతురాలికి ఇద్దరు కుమారులు ఉన్నారు. భర్త లక్ష్మణ్ ఉపాధి నిమిత్తం ముంబైలో ఉంటున్నాడు.

మద్యం పట్టివేత


పట్టుకున్న మద్యంతో ఎస్సై శ్రీకాంత్

లక్ష్మణచాంద(నిర్మల్): మండలంలోని పొట్టపెల్లి కే గ్రామంలో అక్రమంగా నిల్వ ఉంచిన మద్యం పట్టుకున్నట్లు ఎస్సై శ్రీకాంత్ తెలిపారు. బుధవారం గ్రామంలోని బెల్ట్ షాపును తనిఖీ చేయగా అక్రమంగా నిల్వ ఉంచిన రూ.4,750 విలువైన మద్యం పట్టుకున్నట్లు ఎస్సై తెలిపారు. మద్యం స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు ఆయన పేర్కొన్నారు.

ఆల్‌ఇండియా సైనిక్ ఫలితాల్లో ప్రతిభ

కుంటాల: ఆల్ ఇండియా సైనిక్ ఫలితాలు బుధవారం వెలువడ్డాయి. కుంటాలలోని సృజన విద్యానిలయం పాఠశాలకు చెందిన విద్యార్థులు బక్కి రోహిత్, సూర్యతేజ, ఓంకార్, అయాన్, సోహన్ చంద్ర, నిదితారెడ్డి, అభినంద్ ప్రతిభ కనబరిచారు. ప్రిన్సిపాల్ కొత్త కాపు గంగన్న, ఉపాధ్యాయులు అభినందించారు.

భైండోవర్ ఉల్లంఘించిన ఇద్దరికి జైలు


భైండోవర్ చేసిన ఎక్సైజ్ అధికారులు

ఆదిలాబాద్‌టౌన్: ఆదిలాబాద్ పట్టణంలో కొన్ని రోజులుగా అక్రమంగా దేశీదారు విక్రయిస్తున్న ఇద్దరిని గతంలో తహసీల్దార్ ఎదుట బైండోవర్ చేశారు. వారు తీరు మార్చుకోకుండా మళ్లీ దేశీదారు విక్రయిస్తుండడంతో ఆదిలాబాద్ అర్బన్ తహసీల్దార్ శ్రీనివాస్ ఎదుట హాజరుపర్చారు. బైండోవర్ నిబంధనలను ఉల్లంఘించడంతో పట్టణంలోని సుందరయ్యనగర్‌కు చెందిన లావునే సుధాం, మహ్మద్ హఫీజ్‌లను రిమాండ్‌పై జైలుకు తరలించినట్లు ఎక్సైజ్ సీఐ రేండ్ల విజేందర్ తెలిపారు. నిబంధనలకు విరుద్ధంగా దేశీదారు విక్రయిస్తే కఠిన చర్యలు చేపడుతామని పేర్కొన్నారు. పీడీ యాక్ట్ నమోదు చేస్తామని హెచ్చరించారు.

రంజాన్ సందడి


ఈద్గా మైదానంలో ఏర్పాట్లు

నిర్మల్ జిల్లా కేంద్రంలోని మార్కెట్లో రంజాన్ సందడి నెలకొంది. ఓల్డ్ బస్టాండ్ మార్కెట్ సముదాయంలో రోడ్లపై ట్రాఫిక్ రద్దీగా కనిపించింది. ఈద్గా మైదానంలో రంజాన్ పర్వదినాన్ని పురస్కరించుకుని నమాజ్ చేసేందుకు అన్ని ఏర్పాట్లు చేస్తున్నారు.

– సాక్షి ఫొటోగ్రాఫర్, నిర్మల్


సేమీలు కొనుగోలు చేస్తున్న ముస్లింలు

ఏడు ఇసుక ట్రాక్టర్లు సీజ్


సీజ్ చేసిన ట్రాక్టర్లతో పోలీసులు

సాక్షి స్పందన

జైనథ్: ‘సాంగ్విలో హైటెక్ ఇసుక తవ్వకాలు’ పేరిట ‘సాక్షి’లో బుధవారం ప్రచురితమైన కథనానికి స్పందన లభించింది. ఈ మేరకు జైనథ్ సీఐ సాయినాథ్, ఎస్సై పురుషోత్తం, సిబ్బందితో కలిసి ఏడు ఇసుక ట్రాక్టర్లు సీజ్ చేశారు. మండలంలోని సాంగ్వి గ్రామ సమీపంలోని పెన్‌గంగలో ఇసుక లోడ్‌తో ఉన్న ట్రాక్టర్లను సీజ్ చేసి, రెవెన్యూ అధికారులకు అప్పగించారు. అలాగే పక్క గ్రామమైన కౌఠ శివారులో ఉన్న ఇసుక డంప్‌లను సైతం రెవెన్యూ, మైనింగ్ అధికారులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ.. ఇసుక అక్రమ తవ్వకాలు చేపట్టే వారిపై చట్టరీత్యా చర్యలు తప్పవని హెచ్చరించారు. ఇసుక తవ్వకాలు, రవాణా చేసే వారిపై క్రిమినల్ కేసులు సైతం నమోదు చేస్తామని హెచ్చరించారు. వారి వెంట ఆర్‌ఐ నితిన్, మైనింగ్ అధికారులు ఉన్నారు.





ప్రయాణం... ప్రమాదకరం



ప్రమాదమని తెలిసినా కొంతమంది ఆటోవాలాలు విద్యార్థులను పరిమితికి మించి వాహనాల్లో తరలిస్తున్నారు. ఆటోకు రెండు వైపులా బ్యాగులు ఉంచడంతో పాటు డ్రైవర్ సీటులోనూ నలుగురైదుగురిని కూర్చోబెట్టుకుని ప్రయాణం సాగిస్తున్నారు. అలాగే సాత్నాల మార్గంలో తగినన్ని బస్సులు లేకపోవడంతో ప్రజలు జీపులపైనే ఆధారపడుతున్నారు. ఇదే అదునుగా డ్రైవర్లు పరిమితికి మించి టాప్‌పైన ఎక్కించుకుని మరీ తీసుకెళ్తున్నారు. ఏమాత్రం పట్టు తప్పినా పెనుప్రమాదం బారిన పడే అవకాశముంది.

– సాక్షి ఫొటోగ్రాఫర్, ఆదిలాబాద్